సాక్షి
ప్రకాశం

బుధవారం । 12 । జూన్ । 2024



అరచేతిలో వాతావరణం

వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సెల్‌ఫోన్‌లో యాప్‌లు ఉపయోగపడుతున్నాయి.

- 8లో..



దూసుకొచ్చిన మృత్యువు

కారును లారీ ఢీకొనడంతో సీఆర్‌పీఎఫ్ జవాను మృతిచెందిన ఘటన త్రిపురాంతకం మండలం జీఆర్ జంక్షన్ సమీపంలో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37.8/27.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్యను పరిష్కరించండి


- కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఎమ్మెల్యే తాటిపర్తి వినతి



కలెక్టర్‌కు బొకే అందచేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారని, ఆయా ప్రాంతాల్లో శాశ్వత నీటి పథకాలను అమలుపరచి సమస్య పరిష్కరించాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం ఒంగోలులో కలెక్టర్ దినేష్ కుమార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై ఆయన కలెక్టర్‌తో చర్చించి వినతి పత్రం ఇచ్చారు. తీవ్ర నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులకు గత 14 నెలల బిల్లులు రావలసి ఉందని, వాటిని తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు. అస్తవ్యస్తంగా ఉన్న యర్రగొండపాలెం–త్రిపురాంతకం రోడ్డు పనులతో పాటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల అభివృద్ధి పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ వర్గీయులు దాడులకు దిగుతున్నారని, త్రిపురాంతకంలో చెత్త సేకరించే వాహనాన్ని, యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురంలో సచివాలయ బోర్డులను ధ్వంసం చేయడం, నియోజకవర్గంలో జరిగే అల్లర్ల గురించి ఆయన కలెక్టర్‌తో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పట్టాలను పేదలకు పంపిణీ చేయాలని, నియోజకవర్గంలో ఉన్న అభివృద్ధి పనులు పూర్తయ్యేందుకు సహకరించాలని ఆయన కోరారు.

వ్యాధుల కాలం



వ్యాధుల సీజన్ మొదలైంది. నైరుతీ రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. దోమల దండయాత్రతోపాటు మంచినీరు కలుషితమవుతుంది. దీంతో అనేక వ్యాధులు ప్రబలుతాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డయేరియా, మెదడువాపులాంటి అనేక వ్యాధులు ఇబ్బంది పెడతాయి. ఇప్పటికే జిల్లాలో అక్కడక్కడా డెంగీ, మలేరియా జ్వరాలు కూడా ప్రబలుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- అప్రమత్తతే శ్రీరామరక్ష
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జిల్లాలో 99 డెంగీ కేసులు
- మలేరియా కేసులను గుర్తించిన అధికారులు
- 404 టైఫాయిడ్ కేసులు నమోదు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో నిన్నటి వరకు అధికారంలో ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసింది. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది కొరత లేకుండా చేయడమే కాకుండా నాణ్యమైన ఔషధాలు, రక్త పరీక్షలకు ఆధునిక లాబరేటరీలను ఏర్పాటు చేసింది. దీంతో సీజనల్ వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడానికి అధికారులకు వెసులుబాటు లభించింది.

ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరేసి డాక్టర్లు...

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో మొత్తం 72 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరేసి డాక్టర్లు ఉన్నారు. అలాగే జిల్లాలో 19 పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఒక్క ఒంగోలు నగరంలోనే 9 ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇక్కడ ఒక డాక్టర్‌తో సహా ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 4వ తరగతి ఉద్యోగి ఒకరు అందుబాటులో ఉన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియాలాంటి అన్నీ వ్యాధులకు పూర్తి స్థాయిలో మందులున్నాయి. ల్యాబుల్లో 60కు పైగా రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

జిల్లాలో 99 డెంగీ కేసులు:

జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు కనిపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 99 డెంగీ కేసులు వచ్చాయి. 8 మలేరియా కేసులు నమోదయ్యాయి. అయితే వలస కార్మికులు, కూలీల్లో ఎక్కువగా మలేరియా జ్వరాలు వస్తున్నట్లు జిల్లా మలేరియా శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. డెంగీ కేసుల్లో ప్రైవేటు వైద్యశాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌ల్లో, ప్రైవేటు ల్యాబుల్లో చేసే పరీక్షలన్నీ అనుమానాస్పద కేసులుగా వైద్యశాఖ పరిగణిస్తుంది. ర్యాపిడ్ కిట్ ద్వారా చేస్తున్న అలాంటి పరీక్షల్లో పాజిటివ్ గా వచ్చినప్పటికీ అనుమానిత కేసుగానే పరిగణిస్తారు. ప్రభుత్వ వైద్యశాలల్లో చేసే ఎలిసా పరీక్ష ఫలితాన్నే డెంగీగా నిర్ధారిస్తారు. ఒంగోలు, మార్కాపురం ప్రభుత్వ వైద్య శాలలలో ఎలిసా టెస్టు అందుబాటులో ఉంది. ఏదైనా ప్రైవేటు వైద్యశాలలో ర్యాపిడ్ పరీక్షలో డెంగీ పాజిటివ్ వస్తే తప్పనిసరిగా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రైవేటు వైద్యులను వైద్యారోగ్యశాఖ అధికారులు ఆదేశించారు. అలాగే 540 విరేచనాల కేసులు నమోదు కాగా 404 టైఫాయిడ్ కేసులు వచ్చాయి.

మలేరియా

అనాఫిలస్ అనే ఆడదోమ వలన మలేరియా సోకుతుంది. జూన్ నుంచి డిసెంబర్ వరకు ఎక్కువగా మలేరియా ప్రబలుతుంది. వర్షాకాలంలో నీటి నిలువ ఉండే ప్రదేశాలలో ఈ దోమలు పెరుగుతాయి.దోమ కాటు వేసిన 2 వారాల తరువాత చలి జ్వరం, తలనొప్పి వస్తుంది.

దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఇవే...

సీజనల్ వ్యాధుల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు. రెండు మంచి నీరు కలుషితం కావడం వలన వచ్చే వ్యాధులు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికున్ గున్యా, బోదకాలు ముఖ్యమైనవని చెప్పవచ్చు. మంచినీరు కలుషితం కావడం వలన టైఫాయిడ్, డయేరియా, కామెర్లు వ్యాధులు ప్రబలుతాయి.

దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు...

దోమలు ప్రధానంగా మురుగు నీరు నిల్వ ఉన్న చోట పెరుగుతాయి. రోజుల తరబడి నీరునిల్వ ఉన్న చోట దోమలు గుడ్లు పెడతాయి. అవి లార్వాగా మారతాయి. ఇవి ఇంట్లోని కూలర్లు, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, రుబ్బురోళ్లు తదితర వాటిలో దోమలు పెరుగుతాయి. దోమలను, లార్వాలను నాశనం చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి 15 రోజులకు ఒకసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే మట్టితో పూడ్చాలి. వీలుకాని పక్షంలో పెద్ద పెద్ద కుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తారని వైద్యశాఖ అధికారులు తెలిపారు. డెంగీ, మలేరియా జ్వరాలు కేవలం దోమల ద్వారా మాత్రమే సోకుతాయి. దోమలు పుట్ట కూడదు, దోమలు కుట్టకూడదు అనే నినాదంతో ముందస్తు జాగ్రత చర్యలను సూచిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలలో అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దోమలను తరిమేసేందుకుగాను ప్రతి పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. వాటి పనితీరును పరిశీలించుకోవాలని, ఎంత వరకు పనిచేస్తున్నాయో చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



జ్వరం, వాంతులు, విరేచనాలు లాంటివి కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి. అక్కడ అన్నీ రకాల వసతులు, నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫైడ్ వైద్యులు ఉన్నారు. ఎవరైనా సరే ఎలాంటి అనారోగ్య చిహ్నాలు కనిపించినా సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుడిని సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– డా.కే.సురేష్ కుమార్, డీఎంహెచ్‌ఓ

డెంగీ జ్వరం

ఇది ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు ద్వారా సోకుతుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమైన జ్వరం వస్తుంది. నొసట తలపై తలనొప్పి, కంటిలోపల కదలికలు తగ్గుట, కండరాలు , కీళ్లనొప్పులు ఇబ్బంది పెడతాయి. నోరు ఎండిపోవడం, వాంతి వచ్చినట్లు ఉండడం , చర్మంపై కందినట్లు ఎర్రటి మచ్చలు రావడం కనిపిస్తాయి. ఈ జ్వరంలో కొందరికి ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. ఆందోళన చెందకుండా వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలి. సొంత చికిత్స ప్రమాదకరం.

టైఫాయిడ్

ఇది మంచినీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా వస్తుంది. జ్వరం వస్తూ పోతుంది. ఆకలి తగ్గుతుంది. కొంతమందిలో వాంతులు అవుతాయి. 3 రోజులు తరువాత రక్త పరీక్షలలో టైఫాయిడ్ పాజిటివ్ వస్తుంది. సొంత వైద్యం చేసుకోకుండా వైద్యశాలకు వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలి.

హెపటైటిస్ (కామెర్లు)

వర్షాకాలంలో ఎక్కువగా సోకే వ్యాధి పచ్చ కామెర్లు. కలుషితమైన నీరు, ఆహారం, మద్యం అలవాటు ఉన్న వారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మ క్రిములు కాలేయంలోకి ప్రవేశించడంతో కామెర్లు వస్తుంది. కామెర్లు సోకగానే కళ్లు పసుపు పచ్చగా మారతాయి.వెంటనే ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి తగిన వైద్య చికిత్సలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

డయేరియా

వర్షాకాలంలో వచ్చే వ్యాధులలో ప్రధానమైనది విరేచనాలు. ఇది కూడా కలుషితమైన ఆహారం, నీరు వలన వస్తుంది. విరేచనాలతోపాటుగా వాంతులు కూడా అవుతాయి. శరీరంలోని నీరంతా పోవడం వలన మనిషి నీరసపడిపోతారు. ఒక్కోసారి డీ హైడ్రేషన్‌కు గురవుతారు. విరేచనాలు మొదలైన వెంటనే వీలైనంత త్వరగా సమీపంలోని వైద్యశాలకు వెళ్లాలి. అవసరమైన చికిత్స చేయించుకోవాలి. విరేచనమైన ప్రతిసారి శుభ్ర ఎలక్ట్రాల్ తాగాలి. అవసరమైన మైతే సెలైన్లు పెట్టి వైద్య చికిత్స చేయడం జరుగుతుంది. మంచినీరు మాత్రమే తాగాలి. కాచి వడపోయిన నీరు ఎంతో మేలు చేస్తుంది.

ఇంజినీరింగ్‌లో ప్రకాశించారు..

- ఇంజినీరింగ్ టాప్ పదో ర్యాంకులో పుల్లలచెరువు విద్యార్థి
- ఇంజినీరింగ్‌లో 70.82 శాతం, అగ్రికల్చర్ విభాగంలో 82.05 శాతం ఉత్తీర్ణత

ఒంగోలు/పుల్లలచెరువు/కనిగిరి రూరల్/పొదిలి: ప్రభుత్వం విడుదల చేసిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఎప్‌సెట్)లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగంలో 5464 మంది బాలురు, 4416 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 5310 మంది బాలురు, 4300 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 3766 మంది బాలురు (68.92 శాతం), 3231 మంది బాలికలు (73.16 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం గ్రామానికి చెందిన కొమిరిశెట్టి ప్రభాస్ 93.9100 మార్కులతో రాష్ట్రస్థాయిలో పదో ర్యాంకును, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఇక రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించిన షేక్ సూరజ్ ఒంగోలు భాగ్యనగర్ నివాసి. ఇతను 92.9738 మార్కులతో జిల్లాలో రెండో స్థానంలో నిలిచాడు. వీరు కాకుండా కనిగిరి కొత్తపేటకు చెందిన గాదె వీఎస్ఆర్‌ఆర్‌కే తేజాస్ రెడ్డి జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 26), కొనకనమిట్ల మండలం ఇరసలగుండానికి చెందిన దొరిశాల శ్రీనివాసరెడ్డి జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు (రాష్ట్రస్థాయిలో 59), పర్చూరు మండలం లక్ష్మీపురానికి చెందిన సిద్దచంద్ర తేజ జిల్లా స్థాయిలో 5వ ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 64వ ర్యాంకు) కైవసం చేసుకున్నారు. దొనకొండకు చెందిన షేక్ సుహానా జాస్మిన్ జిల్లా స్థాయిలో 6వ ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 132), చీమకుర్తి మండలం గాడిపర్తివారిపాలేనికి చెందిన సాదం వెంకట అశ్విత జిల్లా స్థాయిలో 7వ ర్యాంకు(రాష్ట్ర స్థాయిలో 134), కొత్తపట్నం మండలం అల్లూరు రెడ్డికాలనీకి చెందిన వాసా వెంకట ఆకాష్‌రెడ్డి జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 146), త్రిపురాంతకం మండలం గణపవరానికి చెందిన తంగిరాల మధుప్రియ జిల్లా స్థాయిలో 9వ ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 155), పొదిలి వీఎస్‌పురానికి చెందిన దేసు జీవీఎస్ఎస్ ఆర్యచరణ్‌కు జిల్లాస్థాయిలో 10వ ర్యాంకు (రాష్ట్రస్థాయిలో 229వ ర్యాంకు)ను కైవసం చేసుకున్నారు.

అగ్రికల్చర్ విభాగంలో బాలుర కంటే బాలికలు అత్యధికంగా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. 1161 మంది బాలురు, 2646 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1069 మంది బాలురు, 2400 మంది బాలికలు పరీక్షకు హాజరయ్యారు. 948 మంది బాలురు (81.65 శాతం), 2176 మంది బాలికలు (82.23 శాతం) ఉత్తీర్ణులయ్యారు.



గాదె వీఎస్ఎస్ఆర్‌కే తేజస్‌రెడ్డి



జేఈఈ ర్యాంకర్ ఆర్య చరణ్

– ఎంసెట్‌లో 26వ ర్యాంకు సాధించిన గాదె వెంకట శివసాయి రామకృష్ణ (వీఎస్ఎస్ఆర్‌కే) తేజస్ రెడ్డి స్వగ్రామం కనిగిరి కొత్తపేట. అతని తండ్రి గాదె కోటిరెడ్డి, తల్లి పద్మశ్రీ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇంటర్ మాదాపూర్ లోని శ్రీ చైతన్యలో పూర్తి చేశాడు. ఇంటర్ తర్వాత జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు రాసి ఆల్ ఇండియా స్థాయిలో 183వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 436వ ర్యాంక్ సాధించాడు. తెలంగాణ ఎంసెట్‌లో 48వ ర్యాంక్, ఏపీ ఎంసెట్ ఫలితాల్లో 26వ ర్యాంక్ సాధించాడు. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థానంలో నిలవాలన్నదే లక్ష్యంగా తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో పొదిలి విద్యార్థికి 253వ ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో పొదిలి విశ్వనాథపురానికి చెందిన దేసు ఆర్య చరణ్ ఆల్ ఇండియా 253వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన దేసు మురళీ మోహన్, అనంతలక్ష్మి కుమారుడైన చరణ్ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదువుకున్నాడు. జేఈఈ మెయిన్ పరీక్షలో ఆల్ ఇండియా 44వ ర్యాంకు పొందాడు. తెలంగాణ ఎంసెట్ పరీక్షలో రాష్ట్రస్థాయి 53వ ర్యాంకు సాధించాడు. ఏపీ ఎంసెట్ పరీక్షలో రాష్ట్ర స్థాయి 220వ ర్యాంకు సాధించాడు. ఐఐటీ ఉన్నత స్థాయిలో పూర్తి చేసిన తరువాత కంపెనీ సీఈఓ కావాలనేదే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆర్య చరణ్ చెప్పారు.

ఢిల్లీ ఐఐటీలో చదవాలనుందన్న ప్రభాస్..

ఎంసెట్‌లో రాష్ట్రస్థాయి పదో ర్యాంకు సాధించిన కొమ్మరిశెట్టి ప్రభాస్ స్వగ్రామం పుల్లలచెరువు మండలం అక్కపాలెం కాగా.. అతని తండ్రి కొమ్మరిశెట్టి పోలయ్య గుంటూరులోని మిర్చియార్డులో పనిచేస్తూ గుంటూరులోనే నివాసం ఉంటున్నారు. పోలయ్య పెద్ద కుమారుడైన ప్రభాస్ ఇంటర్మీడియెట్‌లో 972 మార్కులు సాధించి, జేఈఈలో కూడా మంచి ర్యాంకులు తెచ్చుకున్నాడు. అడ్వాన్స్ లో 258, మెయిన్స్‌లో 372 సాధించినట్లు ప్రభాస్ తెలిపాడు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ప్రభాస్ మాట్లాడుతూ తాను ఢిల్లీలోని ఐఐటీలో చదువుకుని సివిల్స్‌లో విజయం సాధించి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉన్నానని తెలిపారు. గ్రామ ప్రజలు ప్రభాస్‌కు అభినందనలు తెలిపారు.



కుటుంబ సభ్యులతో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకర్ ప్రభాస్

ఐఐటీ ముంబైలో చేరతానంటున్న సూరజ్..

ఎంసెట్‌లో రాష్ట్రస్థాయి 15వ ర్యాంకు సాధించిన షేక్ సూరజ్ ఒంగోలు భాగ్యనగర్ నివాసి. ఇతని తండ్రి దరియాసాహెబ్ ప్రస్తుతం రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. సూరజ్ ఇంటర్ నెల్లూరులోని బ్రహ్మదేవి ఐఐటీ క్యాంపస్‌లో చదివాడు. జేఈఈ మెయిన్స్‌లో 300/300 మార్కులతో జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 134వ ర్యాంకును, ఓబీసీ కేటగిరీలో 11వ ర్యాంకు దక్కించుకున్నాడు. తాజాగా ఏపీ ఎప్‌సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకును, జిల్లా స్థాయిలో 2వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా అతను 'సాక్షి'తో మాట్లాడుతూ తనకు జేఈఈ అడ్వాన్స్ ఫలితాల ప్రకారం ఐఐటీ ముంబైలో సీటు వస్తుందని, సీఎస్ఈ గ్రూపు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా సూరజ్‌ను తల్లిదండ్రులతోపాటు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.



షేక్ సూరజ్‌కు అభినందనలు తెలుపుతున్న తల్లిదండ్రులు

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే అన్నా

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల విశ్లేషణను వివరించారు. అనంతరం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌తో అన్నా రాంబాబు

స్థిరంగా సాగుతున్న పొగాకు ధర

- పొగాకు ధర గరిష్టంగా రూ.331

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డుల్లో పొగాకు ధరలు గత వారం నుంచి స్థిరంగా సాగుతున్నాయి. ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో మంగళవారం 9866 బేళ్లు రాగా, 8747 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1119 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 78వ రోజు వేలం పాటలో 5545 బేళ్లు రాగా, 5075 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 470 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.282.85 వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు–2, ఒంగోలు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 73వ రోజు వేలం పాటలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 4321 బేళ్లు రాగా, 3672 బేళ్లు కొనుగోలయ్యాయని, 649 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. అందులో గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.281.93 పడినట్లు చెప్పారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ బత్తుల దంపతులు



వైఎస్ జగన్‌తో డాక్టర్ బత్తుల, సుప్రజారెడ్డి దంపతులు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ మాజీ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జగన్‌కు తమ సంఘీభావం తెలియజేసి, క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



రామారావు

యర్రగొండపాలెం: రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలెబోయిన రామారావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి రాజీనామా లేఖను పంపినట్లు మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని, తనతోపాటు తన వర్గం వారంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వెంట నడుస్తామని స్పష్టం చేశారు.

అరచేతిలో వాతావరణం

- ఫోన్‌లో ఈ యాప్స్ ఉంటే వర్షం రాక.. పిడుగు గుర్తింపు సులువు
- ప్రత్యేక యాప్‌లను రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- గ్రామ పంచాయతీ స్థాయిలో వాతావరణం అంచనా
- వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం
- వర్షం, పిడుగుల సమాచారం ఫోన్లకు పంపుతూ అప్రమత్తం చేస్తున్న వైనం
- వ్యవసాయ, అనుబంధ రంగాల వారికి ప్రయోజనకరమంటున్న అధికారులు



ఒంగోలు సెంట్రల్: 'వాన రాకడ.. ప్రాణం పోకడ' ఎవరికి తెలుస్తుందనేది పాత నానుడి. నేడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతితో వర్షం రాకను ముందుగానే తెలుసుకుంటున్నారు. అదే సమాచారాన్ని మెసేజ్‌ల రూపంలో సెల్ ఫోన్లకు పంపి మానవాళిని అప్రమత్తం చేస్తున్నారు. ఫలితంగా భారీ వర్షాలు , ఈదురు గాలులు, పిడుగు పాటు తదితర ప్రకృతి విపత్తుల నుంచి పూర్తిగా బయట పడలేక పోయినా నష్టం శాతాన్ని తగ్గించుకుంటున్నారు. దేశ ఆర్థిక రంగానికి ప్రాణాధారం వ్యవసాయం, అనుబంధ రంగాలు, విత్తు నాటడం మొదలు తగిన ధరకు విక్రయించుకోవడం వరకు అడుగడుగునా సవాళ్లే. ఈ సమస్యల్లో అగ్రస్థానంలో నిలిచేది వాతావరణం. అనూహ్యంగా మారిపోతూ రైతులకు అనుక్షణం సవాళ్లు విసురుతూ వస్తోంది. వర్షాలు, ఈదురు గాలులు తీవ్ర ఆర్థిక నష్టానికి కారణవుతుండగా, పిడుగు పాటు ప్రమాదాలకు రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెలు, పశువుల కాపర్లు విగతజీవులుగా మారుతున్నారు. పిడుగు పడితే విలువైన పశుసంపద, మహా వృక్షాలు, మనుషులు, జంతువుల ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. పిడుగు పడే అవకాశం ముందస్తుగా తెలుసుకునే అవకాశాలు లేక ప్రాణ, ఆస్థి నష్టాలు సంభవిస్తున్నాయి. అతివృష్టి కారణంగా పంట చేలు దెబ్బతింటున్నాయి. ఈ కష్టాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెరదించింది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్ ఫోన్, ఇంటర్ నెట్ సౌకర్యం ఉంటే వాతావరణం వివరాలు తెలుసుకుని ముందుగానే అప్రమత్తమయ్యే వీలు కల్పిస్తోంది.



వారం ముందే 'మేఘ దూత్'

పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం, పంట నూర్పిడి సమయంలో రైతులను నష్టపరచేది వర్షమే. ఇలాంటి నష్టాల నుంచి బయట పడేందుకు 'మేఘ దూత్' యాప్‌నకు పురుడు పోసింది. దీని సాయంతో వారం రోజుల ముందే వావావరణ మార్పులు, వర్ష సూచన సహా ఆకాశం మోఘావృతం అవుతుందా? లేదా గాలులు ఏ దిశ నుంచి ఏ దిశకు వీస్తాయి? తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్ర వారాల్లో చారిత్రాత్మక వాతావరణ సమాచారాన్ని రైతులకు మెసేజ్ రూపంలో ఆగ్రో మెట్ ఫీల్డ్ యూనిట్(ఏఎంఎఫ్‌యూ) పంపుతోంది.

అనేక ప్రయోజనాలు



వెదర్ యాప్ అందుబాటులోకి రావడంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే వీలు కలుగుతోంది. రైతులకు వర్ష సూచన తెలియక విత్తనాలు వేసుకోవడం, పురుగు మందులు పిచికారీ చేసుకోవడం, రసాయనిక ఎరువులు వేసుకున్న సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసి తీవ్రంగా నష్టాల్లో కూరుకుపోవడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఈ వెదర్‌యాప్‌తో ఎప్పుడు వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీఏ ఒంగోలు




వర్షాన్ని గుర్తించేందుకు 'రెయిన్ ఈ అలారమ్'

ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలు తెలుసుకునేందుకు 'దామిని' యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో 20 కిలోమీటర్ల పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగు పడే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. మెరుపు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ యాప్‌లో వివరించారు. లోకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశముందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్య సాయం, శ్వాస ఆగిపోతే నోటి ద్వారా శ్వాస అందించడం, గుండెచప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతోపాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడనివి, చెయ్యాల్సిన పనులు ఇందులో స్పష్టంగా వివరించారు.

పిడుగు సమాచారానికి 'వజ్రపాత్'

గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమవైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. ఎరుపు, కాషాయం, పసుపు రంగుల్లో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలు ఉంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో అంత దూరంలో(కి.మీలో) పిడుగు పడే అవకాశం ఉందో చూపిస్తుంది. అలాంటిదేమీ లేకపోతే మీ సమీపంలో పిడుగు పడే అవకాశం లేదని సమాచారం కనిపిస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికల బటన్ ఉంటుంది. ఈ యాప్ సాయంతో ఎప్పటికప్పుడు అప్రమత్తం కావచ్చు.



మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కేపీ పరామర్శ

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన అన్నదమ్ములు శీలం లోహిత్‌క్రిష్ణ, సాయిక్రిష్ణలు సోమవారం పట్టణంలోని హెచ్.పి.పెట్రోల్ బంకు వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మంగళవారం ముండ్లపాడు గ్రామంలో మృతదేహాల వద్ద నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదం జరిగిన తీరు పై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబంలో ఒకే సారి ఇద్దరు ప్రమాదవశాత్తు మరణించడం చాలా బాధాకరమైన విషయమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కలువ సుబ్బారావు, నోవెల్, తదితరులు ఉన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న కె.పి.నాగార్జునరెడ్డి

మిలిటరీ క్యాంటీన్ తనిఖీ చేసిన ఉన్నతాధికారి



ఒంగోలు మిలిటరీ క్యాంటీన్ మేనేజర్‌తో మాట్లాడుతున్న జనరల్ ఆఫీసర్ కమాండింగ్ రాకేష్ మనోచ్



గిద్దలూరు రూరల్: క్యాంటీన్‌లోని సామాన్లను పరిశీలిస్తున్న మేజర్

ఒంగోలు: స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిలిటరీ క్యాంటీన్‌ను తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా మేజర్ జనరల్ ఆఫీసర్ రాకేష్ మనోచ్, లెఫ్టినెంట్ కల్నల్ వినోద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గత 11 సంవత్సరాల నుంచి ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహిస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్యాంటీన్‌లో వస్తువుల అమరిక, రికార్డుల నిర్వహణ పట్ల మేనేజర్‌ను అభినందించారు. క్యాంటీన్‌కు అవసరమైన మరికొన్ని మార్పులను తప్పక మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసీహెచ్ఎస్ మోడల్ ప్రాజెక్టు ఒంగోలులో ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ సైనికుల సంక్షేమ శాఖ అధికారి రజనీ కుమారి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు, ఆలపాటి వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, దశరథరామయ్య, మండవ వెంకటేశ్వర్లు, రేడియో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ వైద్యశాల ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఆర్మీ వైద్యశాలను రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మేజర్ జనరల్ రాకేష్ మనోచ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్మీ వైద్యశాలలో మాజీ సైనికులకు అందుతున్న వైద్యసేవల గురించి అక్కడి సిబ్బందిని, రోగులను అడిగి తెలుసుకున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఆర్మీ ఉద్యోగులతో పాటుగా మాజీ సైనికులు అధికంగా ఉంటున్నారని తెలుసుకుని వారికి అందుబాటులో వైద్యశాల ఏర్పాటు చేశారని అందులో వారికి కావాల్సిన వసతులు పూర్తిగా అందుతున్నాయా లేదా అనే అంశాల పై అక్కడి వైద్య సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఒంగోలు రోడ్డులో ఆర్మీ క్యాంటీన్ ను పరిశీలించారు. క్యాంటిన్‌లోని స్టాకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- కారును లారీ ఢీకొట్టడంతో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి
- త్రిపురాంతకం మండలం బీఆర్ జంక్షన్ సమీపంలో ఘటన
- మృతుడిది వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం నర్శింగపల్లి



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన కారు, (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన ఓబులేసు

త్రిపురాంతకం: మరో గంట వ్యవధిలో క్షేమంగా ఇంటికి చేరుకుని, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన సీఆర్పీఎఫ్ జవాన్‌ను మృత్యువు కాటేసింది. సీఆర్పీఎఫ్ జవాన్ ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై త్రిపురాంతకం మండల పరిధిలోని బీఆర్ జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం నర్శింగపల్లి గ్రామానికి చెందిన ఎం.ఓబులేసు(35) డిప్యుటేషన్‌పై ఒడిశా రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడేళ్ల క్రితం శ్రావణి అనే యువతితో వివాహం కాగా ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. తన ఇద్దరు పిల్లల చదువుల రీత్యా మంగళగిరిలో నివాసం ఉంటున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో భార్యాపిల్లలు స్వగ్రామమైన నర్శింగపల్లికి వెళ్లారు. ఒడిశా నుంచి సెలవుపై వచ్చిన ఓబులేసు.. పాఠశాలలు పునఃప్రారంభించే సమయం కావడంతో భార్యాపిల్లలను తీసుకురావడానికి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో బీఆర్ జంక్షన్ వద్ద కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓబులేసు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సాంబశివయ్య పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌లో శ్రీసరస్వతి సత్తా



వివరాలు వెల్లడిస్తున్న శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు: ఏపీ ఈఏపీసెట్‌లో తమ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారని శ్రీ సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఎ.రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కాలేజీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామన్నారు. రాష్ట్రస్థాయిలో 425వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో మరోమారు సత్తాచాటామన్నారు. కె.సాకేత్ సాయిరాం 425, ఆర్.చంద్రవిహారిక 1076, కె.గోపీచంద్ 1275, ఎస్.ఇంద్రసేనారెడ్డి 1592 ర్యాంకులతోపాటు 2వేలలోపు నలుగురు, 10 వేల లోపు 32 మంది, 20 వేలలోపు ర్యాంకులను 89 మంది సాధించారని వివరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్, డీన్లు, ప్రిన్సిపాళ్లు తదితరులు అభినందించారు.

శ్రీప్రతిభ హవా

ఈఏపీసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. దిరిశాల విష్ణువర్ధన్‌రెడ్డి 660, వడ్లమూడి నందిని చౌదరి 1552, చెనికల హరిబాబు 1659, ఆనెకాళ్ల నిఖిత 1823, నందికంటి వెంకట తరుణ్ కృష్ణ 1885, రావి మహేష్ చౌదరి 2420, పుట్లూరి గోపవర్ధన్ 2566, కళ్లగుంట పూజిత 2648, ఘట్టమనేని మోహిత సాయి 2988, ఆనెకాళ్ల శ్వేత 4141, గండి కవిత 4260, తోట వెంకట అవినాష్‌నాయుడు 4267, ఏల్చూరి సాయి వెంకట షాహీత్ 4869 ర్యాంకులు సాధించారని వివరించారు. 5 వేలలోపు 13 మంది, 10 వేలలోపు 23 మంది, 15 వేలలోపు 44 మంది, 20 వేలలోపు 51 మంది, 25 వేలలోపు 75 మంది, 30 వేలలోపు 90 మంది, 35 వేలలోపు 101 మంది ర్యాంకులు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులను చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ అభినందించారు.

'శ్రీచైతన్య' సంచలనం



ఈఏపీసెట్ 2024 ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శ్రీచైతన్య డీన్ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో గొట్టిగుండాల సుష్మ 813వ ర్యాంకు, వై.సాయి వైష్ణవి 1668వ ర్యాంకు, ఎస్‌కే చరిష్మ 2722, కె.భువనేశ్వరి 2919వ ర్యాంకు, సీహెచ్ లక్ష్మీ లలిత 3003వ ర్యాంకును సాధించారు. బైపీసీ విభాగంలో టి.వినూత్న 4403 ర్యాంకు, అలాగే 5 వేలలోపు ఆరుగురు, 7 వేల లోపు 16 మంది, పది వేల లోపు ర్యాంకులు 30 మంది సాధించారని వివరించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన సందర్భంగా తమ అధ్యాపకులు, విద్యార్థులను ఆయన అభినందించారు.

ఉమామహేశ్వర విద్యార్థినికి 6,838వ ర్యాంకు

ఉమామహేశ్వర కాలేజీ విద్యార్థిని ఎం.భవాని 6838వ ర్యాంకు సాధించినట్లు డైరెక్టర్లు సి.మల్లేశ్వరరావు, సి.జయలక్ష్మి తెలిపారు. బి.అనిత 8379, ఎం.దేవీ ప్రియ 12663, కె.హనుమ 13225, ఎంవీ మమత 16367, ఎస్‌కె సమీరా 16832, ఎం.వర్షిణి 18682, వై.త్రిలోచన రెడ్డి 19991వ ర్యాంకు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

బేల్దారు అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శివరామకృష్ణారెడ్డి

మేదరమెట్ల: బేల్దారు పనిచేసుకొని జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ సంఘటన కొరిశపాడు మండలంలోని రాచపూడి శివారులో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు నాగులుప్పలపాడు మండలం టీ.అగ్రహారం గ్రామానికి చెందిన పీకా రాజేష్ (37) భార్యతో కలసి బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో రాచపూడి గ్రామంలో బేల్దారు పనికోసం సోమవారం భార్యతో కలసి రాజేష్ వచ్చాడు. కొద్దిసేపటి తరువాత బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి పనినుంచి రాజేష్ వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు రాజేష్ రాకపోవడంతో ఎక్కడికో వెళ్లి ఉంటాడనుకొని భార్య ఇంటికి వెళ్లింది. ఇంటి వద్దకూడా భర్త లేకపోవడంతో బంధువులకు సమాచారాన్ని తెలపగా మంగళవారం ఉదయం రాచపూడి చుట్టుపక్కల ఉన్న పొదలు, కుంటలు గాలిస్తుండగా చింతతోపు వద్ద చెట్టు కింద రాజేష్ శవమై కనిపించాడు. దీంతో కొరిశపాడు పోలీసులకు సమాచారం అందచేయడంతో అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా నోటి వెంట నురుగు రావడం, తల నుంచి రక్తం కారడం, మెడచుట్టూ గాట్లు వంటివి కనిపించడంతో మృతుని భార్య కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.